# 'కందమూల మిదంజగత్

విజె. ప్రసాద్

ఒక్కొక్కరికి ఒక్కోరకం కూరంటే ఇష్టం ఉంటుంది. అది వారి వారి అభిరుచిని బట్టి ఉంటుంది. శాకాల్లో 'కంద'ని మించింది లేదన్న స్నేహితుడి మాట విని కాముడు - 'ధనమూల మిదం జగత్' అన్న సూక్తిని మార్చిన వైనం బేది?




నేనూ, మా కామేశ్వర్రావు ఉరఫ్ కాముడు, ఒకే ఆఫీసులో పని చేస్తున్నాం. మా ఇళ్లు కూడా పక్క పక్కనే ఉన్నాయి.

రోజూ సాయంత్రం, ఆఫీసు నుంచి వచ్చిన తరువాత, మా పెరట్లో చింత చెట్టుకిందో, లేదా, వాళ్ల సన్న జాజి పందిరి కిందో, కూర్చుని, పిచ్చా పాటీ వేసుకునే వాళ్లం.

మా వాడిలో అన్ని మంచి గూణాలే కాని, ఏదైనా పట్టు కున్నాడంటే, వాడిని పుట్టించిన ఆ బ్రహ్మ దిగి వచ్చి చెప్పినా వదిలి పెట్టడు. వాడికి బుద్ధి తిరిగి మానేయ వలసిందే.

ఓ రోజు సాయంత్రం, వీధిలో కూర్చుంటే చలి వేస్తోందనీ వాళ్లింట్లో కెళ్లి గదిలో కుర్చీలో కూర్చున్నాను. వాడు మంచం మీద కూల బడ్డాడు.

అనుకోకుండా మంచం కిందకి చూసేను. అక్కడ 'సంగిడీ రాళ్ల'లా ఉండి, ముచ్చటగా పేర్చి ఉన్నాయి. అవేమిటో, నా కర్థం కాలేదు.

'ఒరేయ్ కావుడూ! ఆ మంచం కింద ఏమిట్రా సంగిడీ రాళ్లలా కనిపిస్తున్నాయ్. నాకు తెలియకుండా, ఈ మధ్య, 'వెయిట్ లిఫ్టింగ్' కానీ ప్రాక్టీసు చేస్తున్నావేంట్రా?'' అని అడిగేను.

మావాడు, ఓసారి మంచం కిందకి చూసి, ఓ వెధవ పోజు పెట్టేడు.

"ఓ, అవా! అవీ... నేను చెప్పనులే! నువ్వే చూద్దువు గాని''. అని, బోర్లాపడుకుని, మంచం కింద దూరి, ఓ రెండు శాల్తీలని బయటకు లాగి, విజయ గర్వంతో నాకు చూపించేడు.

అవి కంద దుంపలు.

"మరి, ... ఆ మిగిలిన వేమిట్రా?'' అనుమానంగా అడిగేను.

"అవి కూడా కంద దుంపలేరా''. అన్నాడు, మా వాడు, పళ్లికిలించి.

నాకు ఒళ్లు గగుర్పొడిచింది మొదట. తర్వాత మండిపోయింధి.

"రేపు మీ ఇంట్లో ఎవరిదైనా, తద్దినమా?'' అడిగేను మావాడిని.

"అలాంటి దేమీ లేదురా!'' అన్నాడు మావాడు, కొంచెం చిన్న బుచ్చుకుంటూ.

"ఒరేయ్, కాముడూ, ఎన్ని కేజీల కంద కొన్నావురా?'' వస్తున్న ఆవేశాన్ని అణుచుకుంటూ అడిగేను, సాధ్యమయినంత సాత్వికంగా.

"ఓ పది కేజీలు కొన్నాన్రా! ఒరేయ్! నీకు కావాలంటే, మరో పది కేజీలు తెస్తాను గానీ, దీంట్లో మాత్రం, వాటా ఇవ్వన్రేరేయ్!'' అని 'పాండవులకు నా రాజ్యంలో వాడి సూదిమొన మోపినంత జాగా కూడా యివ్వను అని చెప్పిన దుర్యోధనుడిలా పోజు పెట్టి చెప్పాడు మావాడు. 'వాడి' కంద దుంపలు, నే నెక్కడ ఎత్తుకెళ్ళి పోతా నా అన్నట్లుగా!

"నా బొంద లా ఉంది. నువ్వు తిరిగి ఓ వంద యిచ్చినా, నీ దురద కంద నా కొద్దురా బాబూ! అసలు యింత 'కంద' కొనాలన్న ఆలోచన నీ కెలా వచ్చిందిరా, కాముడూ?'' అని అడిగేను ఆశ్చర్యంగా.

"ఒరేయ్ ప్రభా! మరీ అంత తేలిగ్గా కొట్టి పారేయకురా. మా పాత స్నేహితుడొకడు, నాకు నిన్న కనిపించి, చెప్పాడురా, 'శాకాల్లో కందని ఖించింది, లేదని''.

"ఆహా, అలాగా. నాకింత వరకూ, ఆ విషయం తెలిసే తెలీదు సుమా! 'అన్నాను ఎగతాళిగా మా వాడికి అంత అందంగా 'చెవిలో పువ్వులు ఎవడు పెట్టాడా అని ఆలోచిస్తూ.

అంతే! మావాడు నా మాటల్లో వ్యంగ్యాన్ని అర్థం చేసుకో లేకపోయేడు. ఆనందోత్సాహాలతో చెలరేగి పోయేడు.

"ఒరేయ్! ఈ కంద దుంపల గురించి నీకేం తెలుసురా?

"పూర్వం మహర్షులు ఈ కంద మూలాలు తిని, అంతటి వారయ్యేరుట!''

[కొంప తీసి, మావాడు సన్యాసుల్లో కలిసిపోతాడేమో!]

"ఆ నాటి కవి పతంసులు ఈ కంద తిని, 'కంద' పద్యాలు రాసేరుట. పూర్వం చక్రవర్తులు, శత్రువులు లోనికి ప్రవేశించ కుండా, కోట చుట్టూ గేతులు త్రవ్వి, ఈ 'కంద' దుంపలనే, పాతేవారుట! అందుకే వాటిని. కందకం అన్నారుట?

[వీడు, ప్రెసిడెంటయితే, మన దేశం చుట్టూ గేతులు తవ్వి, ఈ కంద దుంపలు పాతి పెడతాడేమో! విదేశీయులు, మన దేశంలోకి రాకుండా.]

"కందర్ప హృదయారవిందుడు, నీల కంధరుడు, అనేపేర్లు భగవంతుడికి, ఈ కంద వల్లే వచ్చేయిరా!

"అందుకే, నేను కంద శతకం రాయబోతున్నాను. మచ్చు కో ఓ పద్యం వినరా.

"ఇందు గల దందు లేదని.
సందేహము వలదు మన 'కంద'రికివే!
'కంద' గల విందే వసందు
'కందే' గతి నీకు, నాకు! కందము భార్యా!

"ఎలా ఉందిరా నా 'కంద' పద్యం?'' అని అడిగేడు, మా కావుడు.

"నా 'బొంద'లా ఉందిరా, 'కంద' మతీ!'' అనివాడిని నాలుగు అక్కడే వాయించేసి, వాడి మొహం 'కంద' గడ్డలా చూద్దామన్న కోరికను బలవంతంగా ఆపుకున్నాను.

"ఒరేయ్, కావుడూ! నీ 'కంద' దురద చూస్తుంటే, మా'కంద'రికీ కంపరం పుడుతోందిరా'' అన్నా న్నేను.

దాంతో మా వాడి మొహం 'కంద గడ్డ'లా చేసుకున్నాడు.

"నా యిష్టం! రోజూ ఉదయం, మధ్యాహ్నాం, రాత్రీ 'కంద' తింటాను.
కందకూర, కందచారు, కంద వేపుడు, కంద పచ్చడి,కంద అట్టు, కందిముద్ద, యింకా కోపం వస్తే, కంద పచ్చిగా తినేస్తా!'' అని అరవసాగేడు, మావాడు.

ఆ అరుపులకు చుట్టు పక్కల వాళ్లూ, వాళ్లింట్లో వాళ్లూ అక్కడికి వచ్చి తొంగి చూసేరు మే మిద్దరం దెబ్బ లాడుకుంటున్నామే మోనని? అదేం లేకపోయే సరికి మాయమయ్యేరు.

ఎలాగా, ఈ యింట్లో వాళ్లనూ, వాడినీ ఈ కంద దుంప ల నుంచి కాపాడడం అని ఆలోచించేను.

ఓ మెరువు మెరిసింది బుర్రలో తళుక్కున. మా వాడికి గురూపదేశం చేశాను.

మీరు నమ్మరు కాని, వెంటనే ఆ కంద దుంప లన్నింటినీ కాలవలోకి గిరాటేశాడు. ఆ రోజు నుంచి 'కంద' అంటే, పది ఆమడల దూరం పరిగెడతాడు.

ఇంతకీ ఆ గురూపదేశం ఏమిటీ అని అడగరేం?

"ఒరేయ్, కాముడూ! ఈ మధ్య మనకి వస్తున్న కంద, అమెరికా నుండి వస్తోందిరా! అక్కడ కంద వల్ల ఏదో భయంకరమయిన వ్యాధి వ్యాపిస్తోందిట్రా! అందుకే వాళ్లు ఆ కందని, మన 'కంద' చేస్తున్నార్రా! అనీ!

ఏమండోయ్! ఒక చిన్నమాట! ఆ ఉపదేశం మావాడికి మాత్రమే పరిమితం! అదేం, నిజం కాదు సుమండోయ్!

★